క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలివీ..

మైలార్‌దేవ్‌పల్లి: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రాఘవేంద్ర కాలనీ ఫీడర్ గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్ ఐసీఏఆర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్, గాంధీనగర్, హనుమాన్‌నగర్, మాణిక్యమ్మ కాలనీ, బుద్వేల్, గ్రీన్‌సిటీ, గ్రీన్ వాక్, మానసాహిల్స్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

బండ్లగూడ పరిధిలో..

హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు మైకెల్ కాలనీ, వినాయక్‌నగర్, డిడి కాలనీ, కాశీమందిర్, ఎన్ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయనగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జిఆర్‌నగర్, మాచెన్‌పల్లి ఎన్‌క్లేవ్, ఇబ్రహీంబాగ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు హీరాకాలనీ, సన్‌సిటి మెయిన్ రోడ్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిల్‌నగర్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు.

శంషాబాద్ పరిధిలో..

విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. రాళ్లగూడ ఫీడర్ పరిధిలోని సీఎస్‌కే, బాలాజీ వెంచర్, కొత్వాల్‌గూడ, ఎయిర్‌పోర్టు కాలనీ,ఇంద్రానగర్, సామ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. జైభవాని ఫీడర్ పరిధిలోని తొండుపల్లి, కిషన్‌గూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు.

నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

రాజేంద్రనగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24, 25, 26 తేదీల్లో రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ ఓపెన్ టూ ఆల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు యూత్ క్లబ్ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 23 సాయంత్రంలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 73867 92120, 95022 51744, 98857 26300లలో సంప్రదించాలని కోరారు.

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తి

రాజేంద్రనగర్: 'కంటి వెలుగు' పథకాన్ని నిర్వహించేందుకు సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ జగన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లలో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్‌లోని మహిళా భవన్‌లో గురువారం ఉదయం ఈ కేంద్రాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రారంభిస్తారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రతి డివిజన్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రోజు వారి పరీక్షలకు అనుగుణంగా కేంద్రాలను విస్తరించనున్నట్లు తెలిపారు.

షాదీ ముబారక్ చెక్కు పంపిణీ



చెక్కును అందిస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట 5వ వార్డు పరిధిలోని అజ్మీర్‌బేగంకు మంజూరు అయిన షాదీముబారక్ చెక్కును కౌన్సిలర్ జి. శివారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి యువతులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయన్నారు. వివాహాల పేరుతో వారు అప్పుల పాలు కాకుండా ఆదుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో అజ్మీర్‌బేగం తల్లితండ్రులు అక్బర్, మెహర్ సుల్తానాలతో పాటు బీఆర్ఎస్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- కార్పొరేషన్ పరిధిలో తీరనున్న దాహార్తి
- రూ. 50 కోట్లతో ట్యాంకుల నిర్మాణం
- త్వరలో పూర్తికానున్న పనులు



గంధంగూడలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు

బండ్లగూడ: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పనులు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శరవేగంగా జరుగుతున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. మంచి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపట్టిన వాటర్ ట్యాంకుల నిర్మాణం త్వరలోనే పూర్తికానుం.

◆ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో..

మిషన్ భగీరథ పథకంలో భాగంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మణికొండ, నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రజల తాగు నీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేసింది.

◆ ప్రణాళికాబద్ధంగా..

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధి కొన్ని కాలనీలకు తాగు నీటి వ్యవస్థ అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు పలు మార్లు సర్వేలు నిర్వహించి ఎక్కడ ఎంత నీరు అవసరం, ఎక్కడెక్కడ వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టవలసి ఉంది అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి గత ఏప్రిల్‌లో కార్పొరేషన్ పరిధిలో 5 వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



బైరాగి గూడలో కొనసాగుతున్న ట్యాంకు నిర్మాణం

◆ బండ్లగూడ జాగీర్‌కు రూ.50కోట్లు..

మిషన్ భగీరథ పథకం కింద కార్పొరేషన్‌కు రూ. 50కోట్లు విడుదల కావడంతో గంధంగూడలోని శ్రీనివాసనగర్ కాలనీ, బైరాగిగూడ, కిస్మత్‌పూర్ లోని ప్రభుత్వ పాఠశాల, రాక్‌చర్చి సమీపంలోని ఎర్రకుంట తదితర ప్రాంతాల్లో చేపట్టిన ట్యాంకు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

◆ పైపులైన్ పనులు పూర్తి

కార్పొరేషన్ పరిధి మెయిన్ లైన్‌లతో పాటు పలు కాలనీలు డిఫెన్స్ కాలనీ,బాలాజీనగర్, గాయత్రి నగర్ కాలనీ, రాక్‌చర్చి రోడ్డు, శివసాయి కాలనీ, భవానీ కాలనీ, తిరుమలహిల్స్, సుబ్రమణ్యం కాలనీ, పిఎన్‌టీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, మిడ్ సిటీ, హిమాయత్‌సాగర్ తదితర కాలనీల్లో ఇప్పటికే పైపులైన్ పనులు పూర్తయ్యాయి.

త్వరలో ప్రతి ఇంటికి తాగు నీరు..



కార్పొరేషన్ పరిధిలో త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికి మంచి నీరు అందేలా చూస్తాం. మరో వాటర్ ట్యాంకు నిర్మాణానికి పద్మశ్రీ హిల్స్‌లోని పార్కు స్థలం అనుకూలంగా ఉంది. త్వరలో అక్కడ పనులు మొదలుపెడుతాం. కేంద్రీయ విహార్ నుంచి మొదలైన 500 ఎంఎం డయా ఇన్‌లెట్ పైపులైన్ నిర్మాణ పనులు త్వరలోనే పూర్తిచేస్తాం. నీటి సరఫరా చేసేందుకు సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణ పనులు, ఇన్‌లెట్, అవుట్‌లెట్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు పనులు అతి త్వరలోనే పూర్తి చేసి కార్పొరేషన్ పరిధి ప్రతి ఇంటికి మంచి నీటిని అందిస్తాం.

–రాజరాజ నరేంద్ర. జలమండలి మేనేజర్



కేంద్రీయవిహార్ వద్ద 500 ఎంఎం డయా ఇన్‌లెట్ పనులు

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుదేరా



కోకాపేట కంటి వెలుగు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్

మణికొండ: కంటి సమస్యలను గుర్తించి వాటిని నివారించాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సుదేరా అన్నారు. బుధవారం ఆమె నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలో కంటి వెలుగు పరీక్షా కేంద్రల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం వివరాలను ప్రతి ఇంటికి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజల సంఖ్యకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్‌స్పజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, డాక్టర్ మిస్బా, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్, నర్సులు వెంకటలక్ష్మీ, తేజలతో పాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రాలు ఇవీ...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట కమ్యూనిటీహాల్, నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వట్టినాగులపల్లిలోని వార్డు కార్యాలయాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు ఆయా కేంద్రాలలో పరీక్షలు ప్రారంభమవుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీ ఎల్ఐజీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఉదయం 9గంటలకు ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ కోరారు.

శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా భోగీశ్వర్లు



శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా భోగీశ్వర్లు నియమితుయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన సాబేర్ అలీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటిషనర్‌గా బదిలీ అయ్యారు. సాబేర్ అలీ దాదాపు 32 నెలల పాటు ఇక్కడ పనిచేశారు. దుండిగల్ కమిషనర్‌గా పనిచేస్తున్న భోగీశ్వర్లు శంషాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటైన తర్వాత మూడో కమిషనర్‌గా నియమితులయ్యారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ పరిధిలో సెల్ఫ్ అసెస్‌మెంట్ దరఖాస్తుల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో గత ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 5,973 సెల్ఫ్ అసెస్‌మెంట్‌లు నిర్వహించారు. దస్తావేజుల అనుగుణంగా పరిశీలనను అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం సెల్ఫ్ అసెస్‌మెంట్‌లను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిర్వహించాలని ఆదేశించడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. గతంలో సెల్ఫ్ అసెస్‌మెంట్‌లను జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం నిర్వహించేది. సెల్‌డీడ్‌తో పాటు లింక్ డాక్యుమెంట్ ఉంటే తప్ప సెల్ఫ్ అసెస్‌మెంట్ నిర్వహించేది కాదు. సెల్ఫ్ అసెస్‌మెంట్‌ను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి మార్చిన అనంతరం ఇందులో అనేక అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ప్రస్తుతం వీటిని నిలుపుదల చేసి పరిశీలనను నిర్వహించాలని ఆదేశించింది. ప్రత్యేకంగా సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది బుధవారం నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలి



విద్యాశాఖమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న టీజీపీఈటీఏ నాయకులు

శంషాబాద్: కామన్ సీనియారిటీ ప్రకారం టీచర్లకు పదోన్నతులు కల్పించాలని టీజీపీఈటీఏ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 110 ద్వారా మంజూరైన 1849 అప్‌గ్రేడేషన్ పోస్టులను కామన్ సీనియారిటీ ప్రకారం కేటాయించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీజీపీఈటీల రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

రాజేంద్రనగర్: అనుమతులు లేకుండా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్న యజమానితో పాటు 10 మందిని శంషాబాద్ ఎస్ఓటి, రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. చింతల్‌మెట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై హ్యాపీహోమ్స్ ప్రాంతానికి చెందిన మంజూర్ కేఫ్ బ్లాక్ యార్డ్ పేరిట హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో రాజేంద్రనగర్, ఎస్ఓటి పోలీసులు బుధవారం ఉదయం హుక్కా సెంటర్‌పై దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు హుక్కా సెంటర్‌కు వచ్చిన పది మంది యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మల్లన్న ఉత్సవాలకు రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



రేవంత్ రెడ్డికి మల్లన్న ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కేంద్రంలో ఈనెల 22న నిర్వహించనున్న మల్లన్న కల్యాణం, బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కాంగ్రెస్ నేతలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం నగరంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నాయకులు డి. కిరణ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆధునికీకరణకు చర్యలు



గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు

శంషాబాద్: గ్రంథాలయాలను ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ. 9 కోట్లతో గ్రంథాలయ భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బుధవారం ఆయన శంషాబాద్ పట్టణంలో రూ. కోటి నిధులతో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణపనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మతో కలిసి పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మరో రూ. 20 లక్షలు అదనపు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీమెటీరియల్ అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. అభ్యర్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆర్. రేఖ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మణికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాదాన్ ఆసుపత్రిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి షాదాన్ ఆసుపత్రి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. బాధితుల్లో ఒకరిని వాహనదారులు షాదాన్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: చెత్తచెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కాలనీలు, బస్తీల్లో చెత్త చెదారం ఓపెన్ పాయింట్‌లలో ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సమేష్, జీహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత



తప్పిపోయిన అన్ష్‌యాదవ్‌ను తల్లి ప్రియాంకకు అప్పగిస్తున్న అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి

బండ్లగూడ: తప్పిపోయిన బాలుడిని అంగన్‌వాడీ టీచర్ గుర్తించి తమ తల్లిదండ్రులకు అప్పగించింది. వివరాల్లోకి వెళితే.. బిహార్ రాష్ట్రానికి చెందిన దివ్యాత్‌యాదవ్, ప్రియాంకయాదవ్ దంపతులు బండ్లగూడకు వలసవచ్చాడు. బుధవారం వారి కుమారుడు అన్ష్‌యాదవ్ ఆడుకుంటూ తప్పిపోయాడు. ఇంటిని గుర్తించలేక ఏడుస్తూ రోడ్డుపై కూర్చున్న అతడిని గమనించిన అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి అతడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంది. తల్లి, తండ్రి పేరు చెప్పిన ఇంటి చిరునామా చెప్పలేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వాకాబు చేసింది. చివరకు సమాచారం తెలుసుకుని తల్లి ప్రియాంకయాదవ్‌కు అన్ష్‌ను అప్పగించింది.

ఖమ్మం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి ఖమ్మం వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన తరువాత మొదటి భారీ బహిరంగ సభను బుధవారం ఖమ్మం జిల్లాలో నిర్వహించటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ఇంటి నుంచి ర్యాలీగా బయలుదేరారు. మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహాల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు ఖమ్మం వెళ్లారు.

తెలుగువారి హృదయాల్లో ఎన్‌టీఆర్ స్థానం సుస్థిరం



సెయింట్ ఆల్ఫోన్సా కరుణాలయంలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

రాజేంద్రనగర్: అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పదులకు అండగా నిలిచిన స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు అన్నారు. నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా హైదర్‌గూడ, అత్తాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్వేల్‌లోని సెయింట్ ఆల్ఫోన్సా కరుణాలయంలో వృద్ధులు, మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మ్యాడం రామేశ్వర్‌రావు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా నందమూరి తారక రామారావు శ్రమించారన్నారు. ప్రజల గుండెల్లో ఆయన ఎప్పుడు చిరస్మరణీయంగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు సి.హెచ్.కృష్ణాగౌడ్, ఎనుగుల కృష్ణారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, బండ్ల జంగయ్య, జయవంత్‌రావు, రాఘవులు, కత్తి దామోదర్‌రావు, రాఘురాజ్‌గౌడ్, సనివెల్లి శేఖర్‌రెడ్డి, టి.మధుకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో..

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా మణికొండ కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అభిమానులు ఆయన విగ్రహం వద్ద ఘనం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముగ్గురు కమ్మ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బ్రహ్మాజీతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం పంటలకు తెలంగాణ అనుకూలం

ఏజీవర్సిటీ: తెలంగాణ భూములు ఆయిల్‌ఫాం పంటలకు అనుకులంగా ఉన్నాయని ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌ఫాం పంటలు సాగుచేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుందని కొండలక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం వీసీ నిరజ ప్రభాకర్, మలేసియాకు చెందిన నూకియా అకాడమీ ఆఫ్‌సైన్స్ చైర్మన్ డాక్టర్ రాజనాయుడు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని కొండలక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ఆయిల్‌ఫాం సాగులో మెలకువలు, వాతావరణ మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ తెలంగాణ వాతావరణం ఈ పంటల సాగుకు అనుకులంగా ఉంటుందన్నారు. అందుకు అవసరమైన నీటి లభ్యత, ఉష్ణోగ్రత తదితర అనుకుల వాతావరణం మన రాష్ట్రంలో ఉందన్నారు. .అయిల్‌ఫాం సాగులో అధునాతన పద్ధతులు పాటించాలని డ్రిప్ ఇరిగేష్ ద్వారానే పర్టిగేషన్ చేయడం ద్వారా మూడు సంవత్సరాల్లో పంట చేతికి వస్తుందని తెలిపారు. ఈ మూడేళ్లు రైతులు నష్టపోకుండా అంతర పంటలుగా కూరగాయలు, పసుపు వంటివి పంటలు సాగుచేసి ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ప్రతి ఒక్కరు సంవత్సరానికి 19 కిలోల ఫాం అయిల్ తీసుకుంటున్నారని, దీనికి అనుగుణంగా 25 మిలియన్ టన్నుల ఫాం అయిల్ అవసరమన్నారు. ప్రసుత్తం మనం 9 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నామని మిగిలింది ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. ఏటా దాదాపుగా రూ. 80 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సరైన ప్రణాళికలతో అయిల్‌ఫాం ఉత్పత్తుల పై దృష్టి సారించాలని తెలిపారు. దీనికి రైతులకు ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు తగు సూచనలు సలహాలు ఇస్తూ రైతులకు అన్ని విధాల వెన్నుదన్నుగా ఉంటుందని వీసీ నిరజప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటి రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ ఆఫ్ అర్టికల్చర్ కిరణకుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ గిర్వాణి,నర్సింహారావు, ఉద్యానవన శాస్త్రవేత్తలు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

మనూ నూతన విద్యార్థి సంఘం



సంఘం అధ్యక్షుడు ఫైజాన్‌కు సర్టిఫికెట్‌ను అందిస్తున్న వీసీ ఐనుల్‌హసన్

రాయదుర్గం: ఉర్దూ యూనివర్సిటీ వారసత్వాన్ని విద్యార్థి సంఘం నిలబెట్టాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2022–23 విద్యాసంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థి సంఘం పదవీ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎండి ఫైజాన్, ఉపాధ్యక్షుడుగా మహ్మద్ మిస్బాజాఫర్, కార్యదర్శిగా ఫైజాన్ ఎక్బాల్, సంయుక్త కార్యదర్శిగా మారియా హిదాయత్, కోశాధికారిగా ఎండి ఖాసీమ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారికి ఎన్నికై న సర్టిఫికెట్లను వీసీ అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, చీఫ్ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ అబ్దుల్ అజీమ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, పరిశీలకులు ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, ప్రొఫెసర్ ముస్తాక్ అహ్మద్ పటేల్ పాల్గొన్నారు.